క్లుప్తంగా

పలువురికి బెల్ట్ సర్టిఫికెట్లు ప్రదానం



తెనాలిఅర్బన్: చెంచుపేటలోని యూనిక్ తైక్వాండో అకాడమి ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్‌లను హైద్రాబాద్‌లో ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ వి కోటేశ్వరమ్మ అందజేశారు. అనంతరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన అయిదుగురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనిక్ తైక్వాండో అకాడమి రాష్ట్ర అధ్యక్షుడు గుద్దంటి వెంకట శివరామకృష్ణ, నాయకులు గొట్టుముక్కల సుబ్బారావు, తిరువీధుల నాగేశ్వరరావు, పద్మశాలి ఎంప్లాయిస్ అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి, మైత్రీ హాస్పటల్ అధినేత డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్, పలువురు కోచ్‌లు పాల్గొన్నారు.

ఆర్టీఓ బాధ్యతల స్వీకరణ



తెనాలిరూరల్: తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి(ఆర్టీఓ)గా కె. ప్రసాద్ బాధ్యతలను సోమవారం స్వీకరించారు. చిత్తూరు జిల్లా కార్వేటినగర్ ఆయన స్వస్థలం. ఎస్వీ యూనివర్శిటీలో విద్యాభ్యాసం చేసిన ఆయన 2018 నోటిఫికేషన్ ద్వారా గ్రూప్–1కు ఎంపికయ్యారు. 2022 సెప్టెంబర్‌లో తెనాలి ఆర్టీఓ బాధ్యతలు స్వీకరించి, మరుసటి రోజే రిలీవ్ అయి తొమ్మిది నెలలు శిక్షణకు వెళ్లారు. శిక్షణానంతరం సోమవారం ఇక్కడకు వచ్చి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీఓకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు, ఏఎంవీఐ మధుసూదనరావు, సిబ్బంది స్వాగతం పలికారు.

ఎన్‌సీసీ రిజర్వేషనుతో ఉద్యోగాలు



తెనాలి: పట్టణ కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు, నాటి 389 జేబీ ట్రూప్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఇద్దరు ఉద్యోగాలను సాధించారు. 2014లో టెన్త్ చదివిన ఎవర్న అనిల్ కుమార్ డిగ్రీ అర్హతతో సెంట్రల్ ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించగా, 2020లో ఇదే స్కూలులో టెన్త్ చదివిన ఎన్‌సీసీ విద్యార్థి మునిపల్లి సుల్తాన్ ఇంటర్ అర్హతతోనే తక్కువ వయసులో ఇండియన్ నేవీలో ఉద్యోగం సంపాదించాడు. వీరిద్దరినీ సోమవారం బాలుర హైస్కూలు ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబీ, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్కార్‌లు అభినందించారు. ఎన్‌సీసీ రిజర్వేషనుతో ఇద్దరు ఉద్యోగాలను సాధించటం గర్వకారణమన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ ఆ ఇద్దరినీ సత్కరించారు.

గ్రంథాలయోద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగాకి నివాళి



తెనాలి: గ్రంథాలయోద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య 92వ జయంతిని సోమవారం స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించారు. డాక్టర్ వెలగా చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనేక మంది ఔత్సాహికులను రచనలు చేసేందుకు ప్రోత్సహించి, వారు బాలసాహిత్యవేత్తలుగా ఎదిగేందుకు డాక్టర్ వెలగా చేసిన కృషిని ప్రముఖ బాలసాహిత్యవేత్త షేక్ అబ్దుల్ హకీం జాని స్మరించుకున్నారు. గ్రంథాలయ పాలకురాలు కావూరి రమాదేవి, విశ్రాంత గ్రంథాలయ పాలకుడు మొవ్వా సుబ్బారావు, లక్కరాజు లక్ష్మణరావు, లావణ్యసుధ, పద్మ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో సోమవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా ఓ నివాసంలో పేకాట ఆడుతున్న వారిని ఎస్‌బీ సీఐ మారయ్య అదుపులోకి తీసుకున్నారు. సీఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం కొలనుకొండ శివారులో ఓ నివాసంలో 15 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో దాడి చేశామని, దాడుల్లో పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.60వేలు నగదు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

సంక్షేమమే పరమావధిగా నాలుగేళ్ల పాలన

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గత నాలుగేళ్లలో రాష్ట్రంలో పరిపాలన జరిగిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఐదో రోజు నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమానికి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. గత మూడున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ పాలనలో తెనాలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 1500 కోట్ల లబ్ధిని నియోజకవర్గ ప్రజలకు అందించినట్టు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన లబ్ధి వివరిస్తూ ప్రజల అవసరాలను తెలుసుకునేందుకు, అర్హత ఉండి సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, గడప గడప కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటిని నెల రోజుల్లో పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. 2024 ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తారో కూడా తెలియని కొందరు నాయకులు పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని, తమకే పరిపాలన వచ్చిన భ్రమలో వారున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, పాలడుగు సాంబశివరావు, రెడ్డి శ్రీనివాసరావు, నాగమోతు రామారావు, నాగమోతు శివనాగేశ్వరరావు, పాటంశెట్టి నాగరాజు, దేవిరెడ్డి పూర్ణయ్య, తోట శ్రీనివాసరావు, అక్కిదాసు కిరణకుమార్, కఠారి హరీష్, బూరెల దుర్గ, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం



హాఫ్‌పేటలో ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ యర్రయ్య, కో–ఆర్డినేటర్ వెంకయ్య

తెనాలిటౌన్: రూరల్‌మండలం హాఫ్‌పేట గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని గ్రామ సర్పంచ్ తలమాల యర్రయ్య ప్రారంభించారు. బాలలందరికి సామాజిక న్యాయం చేయాలి, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ జి.వెంకయ్య మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన తీసుకురావాడానికి ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. బాలలు చిన్న వయస్సులో పనిచేయడం వల్ల అనారోగ్య సమస్యలకు గురవుతారని, శారీరక, మానసిక వేధింపులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సర్పంచ్ యర్రయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలలను పనిలో పెట్టడం నేరమని, బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా గ్రామ బాలల రక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.ఇందు, విద్యా సంక్షేమ సహాయకురాలు డి.చంద్రిక, అంగన్‌వాడీ కార్యకర్త అనూష, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గాలులకు తెగిన విద్యుత్ వైర్లకు మరమ్మతులు

తెనాలిటౌన్: ఇటీవల అకస్మాత్తుగా వీచిన విపరీతమైన గాలులకు తెనాలి డివిజన్ పరిధిలో తెనాలిలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి, సుమారు 140 విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయని, దీని వల్ల సుమారు రూ.40 లక్షల నష్టం జరిగినట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వివి.చిరంజీవి తెలిపారు. తెగిపడిన విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేశామని, నేలకొరిగిన స్తంభాలను పైకి లేపి సరిచేసినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని తెనాలి అర్బన్, రూరల్ మండలాలతో పాటు వేమురు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో తీవ్ర నష్టం జరిగినట్లు చెప్పారు. సుమారు 120 మంది విద్యుత్ సిబ్బంది, 60 మంది కాంట్రాక్ట్ సిబ్బందితో కలిసి దెబ్బతిన్న వైర్లకు మరమ్మతులు చేసి నేలకొరిగిన స్తంభాలను పైకి లేపినట్లు ఈఈ తెలిపారు. వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలగకుండా సకాలంలో స్పందించి సిబ్బందితో పని చేయించినట్లు ఈఈ చిరంజీవి సోమవారం తెలిపారు.

క్రీడాస్టేడియంకు ఎన్నారై రూ.50 వేలు విరాళం



ఎమ్మెల్యే శివకుమార్‌కు విరాళం అందజేస్తున్న గోగిరెడ్డి భానుకవిత

తెనాలి: స్థానిక చెంచుపేటలో గల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలోని అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంకు రూరల్ మండల గ్రామం సంగం జాగర్లమూడికి చెందిన ప్రవాస భారతీయుడు గోగిరెడ్డి భిక్షంరెడ్డి రూ.50 వేల విరాళం అందజేశారు. సోమవారం సాయంత్రం స్టేడియం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో భిక్షంరెడ్డి సతీమణి గోగిరెడ్డి భానుకవిత, ఈ నగదు మొత్తాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు అందించారు. భిక్షంరెడ్డి గత 22 ఏళ్లుగా ఉగాండాలో ఉంటున్నారు. అక్కడి ఎమిమెర్ ఇంజినీరింగ్, ఉగాండా లిమిటెడ్ కంపెనీలో ప్రాజెక్టు మేనేజరుగా పనిచేస్తున్నారు. ఆయన సతీమణి భానుకవిత స్వగ్రామం సంగంజాగర్లమూడి. స్టేడియంలో చక్కని క్రీడావసతులను ఏర్పాటుచేసి, క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణకు స్పందించిన భానుకవిత, తమ వంతుగా ఏదొకటి చేయాలన్న భావనతో ఎమ్మెల్యే శివకుమార్ కార్యాలయాన్ని సంప్రదించారు. వారి సూచన మేరకు బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయిన వాచ్‌మెన్ నివాసానికి రూ.50 వేల విరాళాన్ని అందజేసినట్టు తెలియజేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ, తెనాలికి క్రీడాస్టేడియం ఒక ఆభరణమన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ నేతృత్వంలో స్టేడియం దినదినాభివృద్ధి చెందుతూ క్రీడాకారులకు చక్కని వేదికగా నిలిచిందన్నారు. దాతల సహకారంతో స్టేడియంను మరింతగా అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. 'శాప్' డైరెక్టర్ పిల్లి శైలజ, డాక్టర్ రియాజ్‌ఖాన్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, మట్లపూడి రాజేశ్వరరావు, కోచ్ కె.నాగరాజు, రాజేంద్రకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలకు మైనింగ్ అనుమతి తప్పని సరి

తహసీల్దారు నాంచారయ్య

కొల్లిపర: మండలంలో మట్టి, ఇసుక, బుసక తవ్వకాలకు మైనింగ్ నుంచి తప్పని సరిగా అనుమతులు పొందిన తరువాత మాత్రమే తవ్వకాలు జరపాలని తహసీల్దారు జి.నాంచారయ్య అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి అన్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రతి వీఆర్‌ఓ తన పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి , బుసక, ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అన్న విషయాలను గమనించాలని ఆదేశించారు. ఎవరైన రైతులు తమ పొలంలో మట్టి , బుసక తీయాలని అనుకుంటే వారు మైనింగ్ అధికారుల నుంచి తప్పని సరిగా అనుమతులు పొందాలని సూచించారు.ఎవరైన అక్రమంగా తవ్వకాలు జరిపితే అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి అని గ్రహించిన వ్యక్తులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

తపాల జీవిత బీమా పాలసీల పునరుద్ధరణకు అవకాశం

తెనాలి: ల్యాప్స్ అయిన తపాల జీవిత బీమా/ గ్రామీణ తపాల జీవిత బీమా పాలసీలను తిరిగి పునరుద్ధరించుకునే అవకాశాన్ని భారతీయ తపాల శాఖ కల్పించినట్టు ఆ శాఖ తెనాలి సూపరింటెండెంట్ యు.యల్లమందయ్య చెప్పారు. స్థానిక కొత్తపేటలోని ప్రధాన తపాల కార్యాలయంలో సోమవారం రివైవల్ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో యల్లమందయ్య మాట్లాడుతూ తపాలశాఖ 150 ఏళ్లుగా తపాల జీవిత బీమా/ గ్రామీణ తపాల జీవిత బీమా పాలసీలతో ఎన్నో కుటుంబాలకు బీమా రక్షణ కల్పిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో కష్టమర్ల కోసం కొత్తగా మంచి ఆఫర్‌ను ప్రకటించినట్టు తెలిపారు. ప్రీమియం చెల్లించలేక ఆగిపోయిన పాలసీలను లాప్స్ అయిన పాలసీలుగా పరిగణించి, వాటికి బీమా రక్షణ వర్తించదని గుర్తుచేశారు. ఇలాంటి పాలసీలకు తిరిగి ప్రీమియం చెల్లించడం ద్వారా అన్నివిధాలుగా రక్షణను కల్పిస్తూ, ప్రీమియం చెల్లించిన పూర్తికాలానికి బోనస్‌ను కూడా చేరుస్తామని చెప్పారు. బీమా పాలసీల పునరుద్ధరణకు చెల్లించాల్సిన డిఫాల్ట్ ఫీజులో 25 నుంచి 30 శాతం వరకు రాయితీని తపాలశాఖ ప్రకటించిందని చెప్పారు. ఈనెల ఒకటి తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీవరకు ఈ రాయితీ అమలులో ఉంటుందని చెబుతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే సమావేశంలో ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన పెదగాదెలవర్రుకు చెందిన ఎం.మురళి కుటుంబానికి గ్రామీణ తపాల జీవితబీమా క్లెయిమ్ మంజూరు కాపీని ఆయన అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం

- ప్రారంభమైన తరగతులు, అడ్మిషన్లు
- విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్ల పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సాయిహరేరామ్, రమణరావు



విద్యార్థినికి అడ్మిషన్ ఇస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది



ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న విద్యాదీవెన కిట్లతో విద్యార్థులు



కఠెవరం జెడ్పీ స్కూల్లో కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి, సర్పంచ్ ప్రసాద్, ఎంఈఓ నారాయణ

తెనాలిఅర్బన్: వేసవి సెలవుల అనంతరం సోమవారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. తెనాలి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు ఉదయం నుంచి విద్యార్థులతో సందడిగా కన్పించాయి. విద్యార్థులు ఉదయం 7 గంటలకే పాఠశాలలకు వచ్చారు. ఎండతీవ్రత నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ఉదయం 7.30 గంటలకు తరగతులు ప్రారంభించారు. అలాగే రాగి జావాతో పాటు జగనన్న గోరుముద్దను విద్యార్థులకు అందించారు. ప్రభుత్వం పంపిన జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. అలాగే పాఠశాల సిబ్బంది ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అడ్మిషన్స్ ప్రక్రియ నిర్వహించారు. గంగానమ్మపేటలోని టీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో కౌన్సిలర్ గడవర్తి శ్రీసాయి హరేరామ్, పట్టణ ప్రముఖులు తోటకూర రమణరావులు విద్యార్థులకు జగనన్న కిట్లను పంపిణీ చేశారు. అలాగే ఆయా పాఠశాలలో జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

తెనాలిటౌన్: మండల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను సోమవారం తిరిగి ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు ప్రారంభం రోజున విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులతో విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కఠెవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు టి.శ్రీధర్, విద్యాకమిటీ చైర్మన్ శశికకుమార్ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులు నాణ్యమైన కిట్లను అందిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. నందివెలుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్లను గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు, కిట్‌లు ఉపయోగించుకుని క్రమ శిక్షణతో చదవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రూరల్ మండలం పెదరావూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం సర్పంచ్ కాకి రమాదేవి పంపిణీ చేశారు. విద్యార్థులకు యూనీఫాం, బ్యాగు, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, డిక్షనరీ, బూట్లు, బెల్ట్, టై తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.సరళా, ఉపాధ్యాయులు అనరాధ, సుధాకర్, అంకమరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకి మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్: చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 19న రాష్ట్రంలో అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌లకు మెమోరాండం ఇవ్వాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద జూన్ 19న ధర్నా నిర్వహించి కలెక్టర్లకు మెమోరాండం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమాని అధిక సంఖ్యలో చేనేత కార్మికులు తరలి రావాలని కోరారు. కమిటీ నాయకులు రామనాథం పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, కూరపాటి కోటేశ్వరరావు, దొడ్డి ఈశ్వరరావు, డోకిపర్తి రామారావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉన్నతాధికారి మాతృమూర్తి ఆనందమ్మ మృతి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనిక్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (కర్నూలు) ఉన్నం అహేజ్లేలు మాతృమూర్తి ఉన్నం ఆనందమ్మ (100) ఆదివారం సాయంత్రం పట్టణ శాంతినగర్‌లో మృతిచెందారు. ఆనందమ్మ స్వస్థలం రూరల్ మండలం కొలకలూరు, ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు ఆనందమ్మ భౌతికకాయన్ని సందర్శించి నివాళులర్పించారు. పట్టణ, పరిసరాలకు చెందిన న్యాయవాదులు, వివిధ రంగాలవారు ఆనందమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు.

తెనాలి సీడీపీఓగా సునీత బాధ్యతల స్వీకరణ



ఎం.సునీత, సీడీపీఓ, తెనాలి

తెనాలిటౌన్: తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో సీడీపీఓగా పనిచేస్తున్న డి.గీతాంజలి బదిలీపై పొన్నూరు వెళ్ళారు. పొన్నూరులో పనిచేస్తున్న ఎం.సునీత బదిలీపై తెనాలి సీడీపీఓగా వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం సీడీపీఓ సునీత మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతానికి చర్యలు తీసుకుంటామని, కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేగా నాలుగేళ్లు పూర్తి



ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని క్రీడాస్టేడియంను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించారు. ఆయన రాకను తెలుసుకున్న క్రీడాకారులు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని సెలబ్రేట్ చేసేందుకని ఆవరణలోనే కేక్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, 'శాప్' డైరెక్టర్ పిల్లి శైలజలు కేక్ కట్‌చేశారు. వీరితోపాటు క్రీడాకారులు ఎమ్మెల్యే శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. స్టేడియం కోచ్ కె.నాగరాజు, వైసీపీ నాయకులు డాక్టర్ రియాజ్‌ఖాన్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, మట్లపూడి రాజేశ్వరరావు పాల్గొన్నారు.